# మధుర భావన-5

రెండు రోజుల తర్వాత...

సుమజ తల్లీ తండ్రీ ఇద్దరూ కలిసి ఖాళీగా కూర్చున్నపుడు... సుమజ నాన్న బలరామ్ గారు సుమజతో పెళ్ళి ప్రస్తావన తెచ్చి రెండు రోజుల్లో వాళ్ళు సుమజని చూసుకోవటానికి వస్తున్న విషయం చెప్పి సుమజ అభిప్రాయం అడిగారు. భార్గవి వెంటనే వాళ్ళ వివరాలూ చెప్పుకొచ్చింది.

''ఏదో పేరుకి చూడటానికని వస్తున్నామని చెప్పారు కానీ, అబ్బాయి నీకు తెలిసినవాడే నటకదా... పేరు... ఏమిటీ... కృష్ణమోహన్... నీ చదువు ఈ సంవత్సరంలో పూర్తయింది కాబట్టి పెళ్ళి ఆలోచనా చేద్దామనుకునేలోపలే ఈ సంబంధం వచ్చింది! నీ ఇష్టం ఏమిటో చెప్పవే...'' అంది భార్గవి కూతురివైపు ఆపేక్షగా చూసి.

సుమజ మనసులోకి ఆనందం వెల్లువలా వచ్చేసింది!

ఆమె కనులముందు వంశీ కనుపించాడు! అతని ఉద్దేశ్యం పూర్తిగా చెప్పకపోయినా తనకి కొంచెంగా అర్థం అవుతూనే ఉంది! మీనా కూడా అదే చెప్పిందిగా... మనసులోనే నవ్వుకున్న సుమజ తల్లివైపు ఓరగా చూసి ''వాళ్ళిద్దరూ... మనింటికి వస్తామని అన్నారా అమ్మా...?'' అనడిగింది మెల్లగా.

ఆవిడ కూతురి వైపు ఆశ్చర్యంగా చూసి ''ఏం... ఎందుకురారూ...? అబ్బాయి నీకు తెలిసినవాడే అయినా... అతని అమ్మావాళ్ళూ చూడాలిగా...?'' అంది.

''నీకేమైనా అభ్యంతరం, అయిష్టం ఉంటే చెప్పేయమ్మా... ... పర్వాలేదు...!'' అన్నాడు బలరామ్ భరోసా ఇస్తున్నట్లుగా కూతురివైపు చూస్తూ.

సుమజ కొంచెం తలవంచుకుని చిన్న చిరునవ్వుతో తండ్రికి ''నన్ను వేరే అడగాల్సిన పని లేదు నాన్నా... మీకు నచ్చితే, సరే...!'' అని చెప్పేసి అక్కడ నుండి లేచి అవతలకు వెళ్ళిపోయింది.

బలరామ్ భార్య భార్గవి వైపు ధీమాగా చూసి ''చూసావా... ఎంతైనా అది నా కూతురు! నేను అవునన్నది. ఏదీ కాదనదు! విన్నావుగా దాని జవాబు...!'' అన్నాడు గొప్పగా.

‘‘దానికీ ఇష్టమే, కాబట్టి అలా చెప్పింది! నేను... మా ఫ్రెండు వాళ్ళింటికి వెళ్తున్నపుడు ఆ అబ్బాయి వచ్చాడు... ఇదే పేరు చెప్పి పరిచయం చేసింది! అపుడు నేను ఆరాగా చూడలేదుగానీ... బావున్నట్టే అనిపించాడు! మంచి జోడీయే.....!’’ అంది భార్గవి.

ఆ మర్నాడే... భార్గవి సుమజని అబ్బాయి వివరాలడిగింది.

సుమజ కొంచెం సిగ్గుగా ‘‘నాకూ పూర్తిగా తెలియవమ్మా... దామోదరం గారి ఫంక్షన్ లో కలవటమేగా, మొన్న ఒకసారి మనింటికి వచ్చారు... అంతేగా, అయితే వాళ్ళ నాన్న ఈ మధ్య చనిపోయారు... అమ్మ ఒక్కతే ఉంటారు... ఎక్కడికీ రావటంలేదని వంశీ అన్నాడు... మరి నువ్వేమో... వాళ్ళు వస్తామని చెప్పారని అన్నావుగా...!’’ అంటూ తనకి తెలిసిన సమాచారాన్ని తల్లికి తెలియజేసింది.

భార్గవి తృళ్ళిపడింది.

‘‘ఏమిటీ... అబ్బాయి తండ్రి ఈ మధ్య చనిపోయారా...?! నీకు సరిగా తెలుసా... మీ నాన్న చెప్పిన వివరాల ప్రకారం... తండ్రి ఉన్నాడు... బిజినెస్ చేస్తున్నారే...! మీ నాన్నను వాళ్ళ వివరాలు అడిగివస్తానుండు... నేను వాళ్ళు వచ్చాక అన్నీ తెలుస్తాయిగా అని వివరం కనుక్కోలేదు... అబ్బాయిని చూసా కదా, బావున్నాడు... పైన నీకూ నచ్చాడు కదానుకున్నా...!’’ అంటూ భర్త గదిలోకి హడావుడిగా వెళ్ళిందావిడ.

కాసేపటిలోనే సుమజ దగ్గరకు తిరిగి వచ్చిన ఆమె నిట్టూరుస్తూ కూతురి పక్కన కుర్చీలో కూర్చుని చెప్పుకొచ్చింది. “నిన్న మీ నాన్న ఏం గొప్పలు పోయారనుకున్నావూ... నాకూతురు... నా మాటకి తలవూపటమే తప్ప ఇంకేమి తెలియదు... అంటూ భలే మురిసిపోయార్లే...! అవునూ... ఎలా పొరబడ్డావే...?’’ అంటూ ఆవిడా ఒక నిమిషం ఆలోచనలో పడింది. ‘‘మీ నాన్న చెప్పిన వాళ్ళబ్బాయి పేరూ అదే ‘కృష్ణమోహన్’ అట! నీ స్నేహితురాలు అంజలికి అతను అన్నయ్యట. వాళ్ళింట్లోనే నిన్ను చూసానని చెప్పాడట!’’

ఆ మాటలకు తల వంచుకున్న సుమజ చటుక్కున లేచి వచ్చి తల్లి కాళ్ళ దగ్గర కూర్చుని ‘‘చాలా పొరపాటయిందమ్మా... వంశీ వాళ్ళే మీదగ్గరకు వచ్చి అడిగారనుకుని పొరబడ్డాను... అందుకే... అలా చెప్పేసాను...!’’ అంది గొణుగుతున్నట్లుగా.

‘‘పేర్లూ సరిగ్గా ఒక్కలా ఉన్నాయేంటీ... నువ్వు చెప్పినదాన్ని బట్టి నేనూ ఆ అబ్బాయేనని పొరబడ్డాను!’’ అంది భార్గవి నిట్టూరుస్తూ.

‘‘పేర్లు విషయంలో కూడా నాదే పొరపాటమ్మా. అతని పేరు వంశీ మోహన్. నేనేమో నీకు వంశీకృష్ణ అని చెప్పాను. వాళ్ళ మామయ్య ‘మోహన్’ అని పిలవటం విని అంతా అలా పిలుస్తారనుకుని చెప్పాను. నువ్వేమో కృష్ణమోహన్ అని అనుకున్నట్లున్నావు! అవునా?’’ అనడిగింది సుమజ.

‘‘అది సరే.... అతని పేరు నీకు తెలిసినపుడు... ‘వంశీ కృష్ణ’ అని ఎందుకు చెప్పినట్లూ...?’’ భార్గవి ఆరా తీసింది.

సుమజ పెదవులపైకి చిన్న చిరునవ్వు రాబోతుంటే, నొక్కి పెట్టేసింది.

‘‘అదే.... పొరపాటన్నాను కదా...!’’ అని చెప్పి సుమజ మౌనం వహించింది.

‘‘నాన్న... ఏమన్నారమ్మా...?’’ కొంచెం ధైర్యంగా తల్లినడిగింది. ఆవిడ నిట్టూర్చింది. ‘‘ఏముందీ.... నీకు నచ్చటం ముఖ్యం కదా... అంటూ వాళ్ళకి ఏదో కారణం చెప్పి రావద్దని చెబుతానన్నార్లే...!’’ అని ...”అది సరేగానీ, ఇంతకీ ఆ వంశీ వాళ్ళతో మనం ఎలా మాట్లాడాలీ...? అతనంటే పూర్తిగా ఇష్టమే కదా, మళ్ళీ తికమకలేం లేవుగా...? పెద్దవాళ్ళం... వివరాలన్నీ మాట్లాడుకోవాలిగా...?’’

తల్లిమాటలకు సుమజ కొంచెం ఇబ్బందిగా చూసింది. ‘‘ఇష్టమనేది నా విషయంలో సరే, అతని విషయంలో నాకు పూర్తిగా స్పష్టత రాలేదు... మరి ఆ విషయమూ తొందరగానే నిర్ధారించుకుని చెబుతాలే...!’’ అంది మెల్లగా.

ఆవిడ కూతురివైపు విస్మయంగా చూసింది.

‘‘ఏమిటీ... నీకు... పూర్తిగా ఇంకా తెలియదా...?!’’ అంది. తరువాత ఆవిడ కొంచెం అసహనంగా చూస్తూ లేచి నిలబడి ‘‘ఇలాంటి విషయాల్లో నాన్చుడు కుదరదు... ఏదో తొందరగా తేల్చి చెబితే... ఏం చేయాలో ఏమిటో మేం ఆలోచించుకుంటాం...!’’ అని చెప్పి అక్కడనుండి వెళ్ళిపోయింది.

సుమజ కూడా నిట్టూర్చి ‘‘అవును... స్పష్టంగా ఏ విషయమూ తేల్చుకోవాలి!’’ అనుకుంది మనసులోనే. వెంటనే కార్యాచరణకూ దిగింది.

''హలో...'' ఫోనులో సుమజ వంశీని పలుకరించింది.

వంశీ కూడా బదులుగా 'హలో' అంటూ సుమజేనని నిర్ధారించుకుని ఎగిరి గంతేసినట్లు ఆనందంగా 'నా ఫోను నెంబరు మీకెలా తెలిసింది?' అనడిగాడు ఉద్వేగంగా.

''నా అడ్రసు... మీరెలా తెలుసుకున్నారో అలాగే...!'' సుమజ జవాబు.

''ఓ.... ఒకమ్మాయి వచ్చి నా సెల్ నెంబరు అడిగిందని అమ్మ చెప్పింది. అయితే, మీనాయేనన్నమాట! ఒక క్షణం ఎవరై ఉంటారని ఆలోచించాను గానీ తర్వాత పని హడావుడిలో పడి మరిచేపోయాను! ఇపుడు మీరు ఫోను చేయగానే తట్టింది. మా అమ్మ మీనాని అన్ని వివరాలూ అడిగే ఉంటుంది గానీ నాతో ఏం చెప్పలేదు చూడు!'' తల్లిపై నిష్ఠూరం ధ్వనించింది వంశీ కంఠంలో.

''అదిసరేగానీ... ఇపుడు నేనెందుకు ఫోను చేసానో అడగరేం...?''

''ఓ... కారణం ఉందా... నేనలా అనుకోలేదు... కేవలం సరదాగా మాట్లాడదామని... చేశారనుకుంటున్నా!''

''అదీ నిజమే అయినా.... ప్రత్యేకంగా ఒక కారణం ఉంది! మొన్న మీరు మా ఇంటికి వచ్చినపుడు..... నా విషయంలో ఒకటి జరగదని అన్నారుగానీ... అనుకోకుండా జరగబోయి ఆగిపోయింది!''

''ఏ విషయంలో... ఏమి జరగదని అన్నారూ... నా జ్ఞాపకశక్తి కొంచెం బలహీనం లెండి... వివరం చెబుతారా...?''

"అదేంకాదు... కావాలనే నా చేత చెప్పించాలనే అని నాకనిపిస్తోంది! సరే, నేనే చెబతా... అదే పెళ్ళి చూపుల వ్యవహారం...!''

''సరదాగా జరగనిస్తే సరిపోయేదిగా...! ఏమవుతుందీ?'' అంటూ వంశీ చిన్నగా నవ్వాడు.

''భలేవారే...! ఏమవుతుందీ అంటున్నారు... అర్థం కాకనేనా? వాళ్ళు ముందుకు వెళ్ళాలనుకుంటే... ఎలా... ఏం చెప్పగలను...? అందుకే మీ అబిప్రాయం పూర్తిగా తెలుసుకోవాలనీ....''

''దేని గురించీ...?''

‘‘అదే, ఆ విషయమే...’’

‘‘సరిగ్గా చెప్పండీ... ఏ విషయం...?’’

‘‘నా పట్ల మీ ఇష్టం గురించి...’’

‘‘మీరంటే... ఎవరికి ఇష్టం కలగదు చెప్పండీ?’’ వంశీ ప్రశ్నకి సుమజ పళ్ళు కొరుక్కుంది.

‘‘అలా కాకుండా... అందరి గురించీ వదిలి... ఆ విషయంలో మీ ఉద్దేశ్యం స్పష్టంగా చెబితే... నేను మావాళ్ళతో చెప్పగలను!’’

‘‘అదే.... ఏ విషయంలో...?’’

‘‘మళ్ళీ మొదటికి వచ్చారా...! కావాలనే మీరు మాట్లాడుతున్నారనిపిస్తోంది! సరే, నేనే ముందుగా చెబుతా! కృష్ణ విగ్రహాన్ని మిమ్మల్ని తీసుకెళ్ళమంటే... ఇపుడు కాదన్నారు! అంటే.... నేను ఏమని ఊహించానంటే... నాతో పాటుగా దానినీ మీ ఇంటికి తీసుకురావాలని అనుకున్నారని! అవునా... కాదా... స్పష్టంగా చెప్పండి...!’’

వంశీ మళ్ళీ చిన్నగా నవ్వాడు. అది సుమజకీ వినిపించింది.

‘‘బాగానే ఊహించారు... మరి తీసుకు వస్తారా...?’’

సుమజ చిరాకును తగ్గించుకునే ప్రయత్నం చేస్తూ మెల్లగా అడిగింది.

“నాతో పాటు విగ్రహం రావటమంటే... దాని తర్వాతకదా... దాని గురించే మీ అభిప్రాయం అడుగుతున్నానూ..’’ అంది గట్టిగా సుమజ స్వరం పెంచి.

అతనూ అలాగే స్వరం పెంచి ‘‘దాని తర్వాత అంటే... దేని తర్వాత అని నేనూ అడుగుతున్నానూ...’’ అన్నాడు.

అతని కొంటెతనం సముజకి అర్థమైంది.

''ఇపుడు నాకూ తెలుస్తోంది నానోటి వెంటే ఆ మాట వినాలని మీకుందని? అందుకే చెబుతున్నాను. 'పెళ్ళిగురించి... అదీ నాతో' అని అర్థం చేసుకుని మీ ఇష్టం, అభిప్రాయం ఏమిటో తెలియజేయండి.'' అంది సుమజ. తనకీ నవ్వొచ్చింది.

''నా ఇష్టం ఏమిటో... నేను ప్రత్యేకంగా చెప్పాలంటారా...? ప్రయాసపడి మీ అడ్రసు సంపాదించి... కలవటానికి వచ్చినరోజే అర్థం కాలేదా...?''

''అయింది కనకనే... పేరు గురించి విని, అపోహపడి... మీరే ననుకుని 'మీ ఇష్టం' అని నాన్నతో ధైర్యంగా చెప్పేసా...! అమ్మకూ నేను మీ పేరును... వంశీకృష్ణ అని, అంతా మోహన్ అని పిలుస్తారని చెప్పటంతో... కృష్ణ మోహన్ అనే పేరు విని అమ్మా మీరేననుకుంది. కానీ ఈ రోజు అతను నా ఫ్రెండ్ అంజలి కు అన్నయ్య అని అమ్మ మాటల ద్వారా తెలుసుకుని... అమ్మకు నేను పొరబడిన విషయం చెప్పాల్సి వచ్చింది! అందుకే... ఇపుడైనా మీ ఇష్టాన్ని ఖచ్చితంగా తెలుసుకోమని చెప్పింది...!''

''అసలింతకీ మీ నాన్నగారేమన్నారూ...? వాళ్ళకు రానవసరం లేదని చెప్పారా, లేదా? మరి... నా ఇష్టం స్పష్టంగా తెలియలేదన్నారు... కదా, అందుకనీ...?'' అతని ప్రశ్న.

''అది నిజమే... మీ ఇష్టం గురించి నాకు స్పష్టంగా తెలియకపోవటమన్నది! కాకపోతే... ఎవరో ఆ కృష్ణ మోహన్ పట్ల అయిష్టం అన్నది మాత్రం నాకు బాగా తెలుసు కనుకనే వద్దని చెప్పేసా...!''

'' అవునా... మరి... విగ్రహం మీతో పాటు రావాలంటే... నా భావం బాగానే గ్రహించానని అన్నారూ...?''

''అవును... అన్నాను... అది కేవలం నా ఆలోచన మాత్రమే అయివుండొచ్చనే అనుమానం అందుకే ఖచ్చితంగా తెలుసుకుందామనీ...!''

''సరే... సరే... ఇపుడు ఇద్దరికీ ఎలాంటి అనుమానాలూ లేకుండా స్పష్టత వచ్చింది కాబట్టి ఖచ్చితంగా పెద్దవాళ్ళతో చెప్పేయండి!''

మెల్లగా సుమజా అంది ''సరే... మిగతా విషయాలన్నీ వాళ్ళే చూసుకుంటార్లెండి!'' వెంటనే వంశీ అన్నాడు ''కానీ... ఒక విషయం ముహూర్తాలూ వంటి మిగతా విషయాలకు అంత తొందరేం లేదనే సంగతీ చెప్పండి!''

‘‘అదేమిటీ... ఎందుకలా?’’ సుమజ ఎదురు ప్రశ్న వేసింది.

‘‘ఎందుకు... ఎందుకంటే... సరిగా చెప్పలేకపోతున్నాగానీ... నిశ్చయించబడ్డాక, పెళ్ళికి ముందున్న ఈ సమయం చాలా విలువైనది! ఎంత ఎక్కువుంటే, అంత మంచిదనీ...!’’ చిన్నగా నవ్వాడు వంశీ

‘‘నాకేం సరిగా అర్థం కాలేదు!’’

‘‘ఒక్క నిముషం ఆలోచిస్తే... అర్థం అవుతుంది! మధురభావ లహరిలో మనమూ తేలిపోవాలిగా...’’ అంటూ చిన్న నవ్వుతో రాగం తీసాడు వంశీ.

సుమజ చిరాకు పడుతూ అంది. ‘‘నా ప్రశ్నకి అది సమాధానమా... ఏదో పాత సినిమా పాటలోని చరణాన్ని ఆలపించటం...?’’

‘‘కాదా మరి...? అందుకేగా, కొంచెం ఆలోచించాలీ అన్నాను. మనసులో మధుర భావాల దొంతరను పేర్చుకునే సమయమిదేగా...?’’

‘‘ఏం... ఆ తర్వాత మధురభావాలకు ఫుల్ స్టాప్ పడిపోతుందా? నేనేమో అవి రెట్టింపు అవుతాయని అనుకుంటున్నానూ...?!’’ గొంతులో కొంచెం సిగ్గునూ, చిరునవ్వునూ కలగలపి సమాధానం చెప్పింది సుమజ.

‘‘అదీ నిజం కావచ్చును! కానీ... నా అభిప్రాయం ప్రకారం... ఏవో... ఏవో... మధురిమల్ని అందుకుంటామనే ఆశతో... ఆ రోజులకోసం ఎదురుచూసే సమయం ఇంకా మధురమైనదని!’’

సుమజ చిన్నగా నిట్టూరుస్తూ అంది ‘‘అసలు... ఈ మధురభావాల గోల ఏమిటో నాకు అంతుబట్టడం లేదూ...!’’

‘‘లేదా...?’’ అంటూ గొంతులో ఆశ్చర్యాన్ని గుమ్మరించాడు వంశీ.

‘‘నేనసలు... మీరెవరో, ఎలా ఉంటారో కూడా ఏమీ తెలియనపుడే... మీరు మీ స్నేహితురాలికి రాసిన చిన్న కవితను చదివి మధురభావనలో మునిగిపోయా ! ఆ తర్వాత అనుకోకుండా మీతో పరిచయం కలగటం... ఇద్దరం ఆ కవితనే రాసి ఉమ్మడిగా బహుమతి గెలుచుకోవటం... అక్కడ సరదాగా గడిపిన ఆ రెండు రోజులూ, తర్వాత మీ ఇంటికి వచ్చినపుడు... ఇద్దరం కలిపి టిఫిను తయారుచేసి సరదాగా కబుర్లు

చెప్పుకుంటూ తినటం... ఇప్పుడూ ఇలా ఇష్టంగా ఫోనులో కబుర్లు చెప్పుకోవటం... ఇవన్నీ మధుర భావనలు కావంటారా...?''

''బావుంది...!'' అంటూ చిన్నగా నవ్వింది సుమజ.

''కదా... మరి... ఆ బావుందిని ఇంకా ఇంకా పెంచుకోవాలన్నదే నా కోరిక...! అర్థమైందిగా...?''

సుమజ ''చాలా మధురంగా ఉంది'' అంటూ మళ్ళీ చిన్నగా నవ్వింది.

''సరే నేను మా వాళ్ళకు మీ ఇష్టాన్నీ తెలియజేస్తాను. ఇక తర్వాతి విషయాలన్నీ మీ ఇష్ట ప్రకారం ప్లాను చేసుకోండి... అదే... 'మధురభావ లహరిలో మునగటం... తేలటం' లాంటి వాటికి ఎంత సమయం అవసరం అవుతుందో, అలాంటివన్నీ అన్నమాట...!''

''అనుమతి ఇవ్వటం కాదు... మీరూ సహకరించాలన్నదే ముఖ్యం కదా! మీ తోడు లేకుండా నా ఒక్కడి వల్లా అయ్యే పనికాదు...!''

''సహకారమా...? అంటే... ఎలా...?''

''ఇలాగే.... రోజూ ఫోను చేసి... నాలుగు తీయని మాటలు చెబితే... అవి రోజంతా నేను నెమరేసుకుంటూ... మధురభావనలను దొంతరగా పేర్చుకుంటూ ఉంటాను....!'' వంశీ సరదాగా నవ్వాడు. ''మళ్ళీ నొక్కి వక్కాణిస్తున్నాను... మీ కెటువంటి సందేహం రాకుండా ఉండేందుకు... 'నిను చూసిన నిముషమందే.... మనసు నీ వశమైనదీ... అయినదేమో అయినదీ...'' అంటూ నవ్వుతూ సన్నగా రాగం తీసాడు వంశీ.

''అబ్బో.... పాటలు కూడా బాగా పాడగలరని నిరూపించుకుంటున్నారు! అది సరేగానీ, చూసీ చూడగానే ప్రేమ పుడుతుందా... వాళ్ళ గురించి ఏమీ తెలియకుండా, కొంచెమైనా పరిచయం లేకుండా...?''

''కొందరి విషయంలో... అది నిజమౌతుందని నాకు రుజువైందికూడ! అంతెందుకూ, చూడకమునుపే... మీ చిన్న కవితలోని అక్షరాలు సొగసుకూ, మాధుర్యానికీ నాలో ప్రేమ పుట్టేసి... ఒక మధురభావనని కలిగించిందని చెప్పాగా...!''

''అవునా... నాకు మాత్రం... అక్కడ ఉన్న రెండు రోజుల పరిచయంలో కొంచెం ఇష్టం ఏర్పడి... ఆ తర్వాత అడ్రసు తెలుసుకుని మా ఇంటికి వచ్చినపుడు బాగా స్థిరపడింది మనసులో...! అందుకే...'' అంటూ కొంచెం సమయం ఆగి, మళ్ళీ చెప్పింది. ''నా కూతురు నామాట ఎపుడూ కాదనదు అంటూ మురిసిపోయిన నాన్నగారికి 'పొరబడ్డానని...నా ఇష్టాన్ని చెప్పమని' ధైర్యం చేసి అమ్మకు చెప్పగలిగాను...!''

''నా అదృష్టం బావుంది కాబట్టి... భగవంతుడు మీకా ధైర్యాన్నిచ్చాడు...!'' చిన్నగా నవ్వుతూ అన్నాడు వంశీ.

''సరే... సరే... ఇప్పటికి ఈ సంభాషణకి ఫుల్ స్టాప్ పెట్టేద్దాం...!'' అంది సుమజ. ఫోను ఆపేసి నవ్వు మొహంతో నిలబడిన వంశీ వైపు తేరిపార చూస్తూ అంది శ్యామసుందరి ''ఎందుకంతగా నీ మొహం వెలిగి పోతోందీ... సుమ ఫోను చేసిందా...?''